క్లుప్తంగా

ఆలయానికి మైక్ వితరణ

సంబేపల్లె : మండల పరిధిలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయానికి మైక్ వితరణ చేశారు. రాయచోటి తిరుపతి నాయుడు కాలనీకి చెందిన దంపతులు హారీష్, సాహితీలు రూ.20 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను వితరణ చేశారు.

ఐరన్ ర్యాక్ స్టాండ్ వితరణ

రాజంపేట రూరల్: వైఎస్సార్ సీపీ నియోజక వర్గ మహిళా కార్యదర్శి మిరియాల సురేఖ మన్నూరు అంగన్ వాడీ కేంద్రానికి బుధవారం ఐరన్ ర్యాక్ స్టాండ్‌ను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రచయిత మిరియాల శివరామ కృష్ణ, టీచర్ ఎస్ చాముండేశ్వరి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాజంపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో బుధవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈవైద్య శిబిరంలో తిరుపతికి చెందిన నారాయణాద్రి హాస్పిటల్, వాసన్ ఐకేర్ హాస్పిటల్ వైద్యులు రిషితారెడ్డి, మస్తాన్ రోగులకు ఉచితంగా ఈసీజీ తీయడంతో పాటు కంటి, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. 300 మంది పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కొండూరు శరత్‌కుమార్‌రాజు, పెంచలయ్య, కేఎంఎల్.నరసింహులు, షేక్ అబ్దుల్లా, రఘువీరరాజు, బాలాజీ నాయుడు, ఈశ్వరయ్యానాయుడు, విశ్వనాథరాజు పాల్గొన్నారు.

ఇంటి పట్టాలు ఇవ్వండి

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు పంచాయతీ, జ్ఞానంపల్లి దళితవాడ గ్రామానికి చెందిన పేద దళిత కుటుంబాల వారికి ఇంటిపట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు బుధవారం తహశీల్దార్ పుల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పి నాగమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రమణయ్య

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులుగా పెదివీటి రమణయ్య ఎన్నికయ్యారు. బుధవారం ఈ మేరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు అధ్యక్షులు ఉసిరి పాటి బ్రహ్మయ్య ఆదేశాలతో ఈ నిర్ణయం మేరకు ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర – కోకన్వీనర్ రామాంజనేయులు, జిల్లా నాయకులు జి. శ్రీనివాసులు, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి

రామాపురం : మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ పాఠశాలలలో చేర్పించాలని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ అధికారి పద్మజ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పూర్వ ప్రాథమిక విద్య ప్రధాన్యత గురించి గ్రామస్తులకు తెలియజేశారు. 5 సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించుటకు దృవపత్రాలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మజ, రాణి, హంశేనమ్మ, సుజాతరెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

పుల్లంపేట: పుల్లంపేట–చిట్వేలి రహదారి ఆక్రమణకు గురికావడంతో తహశీల్దార్ నరసింహకుమార్ ఆధ్వర్యంలో ఆక్రమణదారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో బుధవారం పోలీసు బందోబస్తు మధ్య జేసీబీలచే అక్రమ కట్టడాలను తొలగించారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్ కుమార్, పోలీసులు, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

బక్రీద్ నిర్వహణకు ఏర్పాట్లు


మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్

రాయచోటి అర్బన్ : బక్రీద్ పండుగ నిర్వహణకు అవసరమైన అన్నిరకాల ఏర్పాట్లను మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు మున్సి పల్ ఛైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాష అన్నారు. బుధవారం మధ్యాహ్నం ఆయన తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈ యేడాది కూడా పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పండుగ నిర్వహణ, జంతువులను ఖుర్బానీ ఇచ్చే అంశంపై కొందరు అనవసర రాద్ధాంతం చేస్తూ, అసత్య ప్రచారాలు చేస్తుండడం తగదన్నారు. పట్టణంలోని హిందూ – ముస్లిం సోదరులంతా కలసికట్టుగా పండుగను నిర్వహించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత యేడాదిలో లాగా ఈయేడాది కూడా ఎంపిక చేసిన 4 ప్రాంతాలలో ఖుర్బానీ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

పెనగలూరు: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీపీఎం వేణుమాధవ్ అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో విజన్ బిల్డింగ్ కార్యక్రమంపై ఎస్‌హెచ్‌జీ వీఓలు, ఎంఎస్ సభ్యులకు శిక్షణా తరగతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ సభ్యులు పుస్తక నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం నిరంజన్ కుమార్, సీసీలు శివయ్య, ఆనందరావు, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

రాజంపేట టౌన్ : మనిషికి ఆరోగ్యం వెలకట్టలేని సంపదతో సమానమని మన్నూరు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన యోగా బెడ్‌ను బుధవారం వాకర్స్ ఇంటర్నేషనల్ 302 ప్రతినిధులు కొండూరు శరత్‌కుమార్‌రాజు, కోనేటి రవిరాజుతో కలిసి ఎస్ఐ ప్రారంభించారు. ఈసందర్భంగా భక్తవత్సలం మాట్లాడారు. మనిషి దినచర్యల్లో వాకింగ్, యోగా, వ్యాయామం వీటిలో ఏదో ఒకటి భాగం కావాలని తెలిపారు. ఈకార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కొండూరు శరత్‌కుమార్‌రాజు, రవిరాజు, డాక్టర్ జగన్మోహన్, రిటైర్డ్ హెచ్ఎం ఏ.శంకర్‌రాజు, విశ్వనాధ్‌రెడ్డి, విశ్వనాథరాజు, షేక్ అబ్దుల్లా, కేఎంఎల్.నరసింహులు, జయచంద్రరాజు, రఘునాధరాజు, సిద్దు, జనార్ధన్‌రెడ్డి, మోహన్‌రాజు, నాసరుద్దీన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ హార్టికల్చర్ కళాశాలలో యోగా దినోత్సవం

రైల్వేకోడూరు : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో ఇన్‌చార్జ్ అసోసియేట్ డీన్ డాక్టర్ రూత్ బెనర్జీ ఆధ్వర్యంలో బుధవారం యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసి యోగా మాస్టర్ శివకుమార్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కే.లీలాగోపాల్, అధ్యాపకులు డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ సయ్యద్ సదరున్నీషా, డాక్టర్ లలిత, డాక్టర్ దీప్తి కిరణ్, పీడీ రవిశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా చేయండి.. ఆరోగ్యంగా ఉండండి

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరంలో అమృత సరోవర్ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉపాధి పనులు చేయడానికి వచ్చిన ఉపాధి కూలీలతో బుధవారం యోగా చేయించారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన చేసి ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు. అనంతరం మాధవరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలసి యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది రవికుమార్, గ్రామ సర్పంచ్ షామీదా, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్. మహబూబ్ బాష పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రాయచోటి అర్బన్ : యోగసాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్దిస్తుందని ఆయుష్ విభాగం వైద్యాధికారి నూర్ అలీ షా అన్నారు. స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ ప్రభుత్వ ఆయుష్‌శాఖ, జిల్లా క్రీడల అభివృద్ధి ప్రాధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. కళాశాల నుంచి పట్టణంలోని నేతాజి సర్కిల్‌వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఏడీ సుధాకరరెడ్డి మాట్లాడుతూ శ్రీవాసవి యోగశిక్షణ సంస్థ వ్యవస్థాపకులు కృష్ణదేవరాయలు, జిల్లా క్రీడల అభివృద్ధి ప్రాధికార సంస్థ అధికారి ఎస్.కె.షఫీ ప్రోత్సాహంతో కళాశాలలో 3 రోజులుగా యోగాశిక్షణా తరగతులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బాలాజి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాయచోటి ఆర్టీసీ డిపోలో..

రాయచోటి ఆర్టీసీ డిపో ఆవరణలో బుధవారం అన్నమయ్య జిల్లా ప్రజారవాణాధికారి రాము ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ది రాచవీడు పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీ అధ్యక్ష,కార్యదర్శులు సతీష్‌కుమార్, జంగమయ్యలు ఆర్టీసీ కార్మికులతో యోగాసనాలు వేయించారు. ధ్యానం చేయించారు. కార్యక్రమంలో డీఎం ధనుంజయతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

చిట్వేలి : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్‌సిసి అధికారి పీ రాజశేఖర్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ఆరోగ్యవంతులుగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగాసనాలు చేయడం అవసరమన్నారు. 30వ ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రాజ్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గరాజు, సుభాష్ చంద్రబోస్, శ్రీనివాసులు, విశ్వనాథం, షబ్బీర్ అహ్మద్, మంజుభార్గవి, గాయత్రి, సుహాసిని, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

రాజంపేట : రాజంపేట ఏఐటీఎస్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నారాయణ ఆధ్వర్యంలో యోగ ఇన్‌స్ట్రక్టర్స్ ఆంజనేయులు, జీఎన్ బ్రహ్మయ్య యోగాసనాలు విద్యార్థులకు నేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంసీఏ హెచ్‌వోడీ డా.మదన్‌కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డా.ఓబులపతి, జయశంకర్, విజయలక్ష్మీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

■ యోగ ఆసనాలు పుస్తకపాఠాలు కావాలని అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత అన్నారు. బుధవారం ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా యోగా శిక్షణ శిబిరంను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తపల్లె రాజాచారి, యంబలూరు అనిల్‌కుమార్, గెలివి కుమార్ యోగా మాస్టర్లు యోగవల్ల కలిగే లాభాలను తెలియచేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రదీప్‌కుమార్, ఎన్ఎస్ఎస్ బృందం పాల్గొన్నారు. అనంతరం యోగ మాస్టర్లకు జ్ఞాపికలను అందచేశారు.

దినచర్యలో యోగా భాగం కావాలి

రాజంపేట రూరల్: దిన చర్యలో ఒక భాగంగా ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగాను అభ్యసించాలని కాకతీయ విద్యాసంస్థల ఛైర్మన్ పోలా వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య నాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి నాగరాజు, అధ్యాపక బృందం , ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

సిద్దవటం: యోగా చేయడం వల్ల ఆరోగ్యం చేకూరుతుందని సిద్దవటం ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని ఏపీఎస్పీ11వ బెటాలియన్‌లో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా ఆసనాల కార్యక్రమం నిర్వహించారు. కమాండెంటు ఎన్. శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగా చేయడం వలన సిబ్బంది ఒత్తిడికి లోను కాకుండా విధులు నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంటు కె. ప్రభుకుమార్, అసిస్టెంటు కమాండెంట్లు ఎన్‌డి ప్రసాద్, వి. జయప్రసాద్, కె. వెంకట్‌రెడ్డి, వి. కేశవరెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.


చిట్వేలి: యోగాసనాలు చేస్తున్న విద్యార్థినులు


రాయచోటి టౌన్ : ఉపాధి కూలీలతో యోగా చేయిస్తున్న దృశ్యం


రాజంపేట టౌన్: యోగా బెడ్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు


సిద్దవటం : బెటాలియన్‌లో పోలీసు సిబ్బంది యోగా చేస్తున్న దృశ్యం


రాజంపేట: ఏఐటీఎస్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


రాయచోటి అర్బన్ : సాయి కళాశాలలో..


రైల్వేకోడూరు : వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో ..

విద్యార్థి దశనుంచే పోటీ పరీక్షలను ఎదుర్కోవాలి

లక్కిరెడ్డిపల్లి : విద్యార్థి దశనుంచి అన్ని పోటీ పరీక్షలను ఎదుర్కోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్ పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో ఆర్థిక అక్షరాస్యత మీద 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని పది పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభచాటిన ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు అఫ్రా, గీతాంజలి కు రూ. 4 వేలు, జడ్పీ పాఠశాలకు చెందిన రెడ్డిప్యారీ, నితీష్ కుమార్‌లకు రూ. 3 వేలు మేనేజర్ వెంకటేష్ చేతులు మీదుగా నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, పురుషోత్తం రెడ్డి, బ్యాంక్ సిబ్బంది చంద్రమౌళి, సాయి ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మేనేజర్ రాజేష్

విద్యార్థుల మేధస్సు పెంచేందుకు క్విజ్ పోటీలు

రాయచోటి: విద్యార్థుల మేధస్సు పెంచేందుకు క్విజ్ పోటీలు దోహదం చేస్తాయని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా 8,9,10వ తరగతులు చదువుతున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయిలో ఆల్ ఇండియా ఆర్‌బీఐ స్కూల్ క్విజ్ 2023ను నిర్వహించారు. జిల్లాలో ప్రతి మండలస్థాయి స్కూల్‌లో ప్రభుత్వ పాఠశాలకు సంబంధించి ఇద్దరు విద్యార్థులను ఒక టీమ్‌గా నిర్వహించారు. ఈ క్విజ్‌లో ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో నిలిచిన స్కూళ్ల విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ. 5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 4 వేలు, తృతీయ బహుమతిగా రూ. 3 వేలతో పాటు ప్రశంసాపత్రాలు ఇవ్వడం జరిగిందని లీడ్ బ్యాంక్ మేనేజర్ తెలిపారు.

ఆర్థికరంగంపై అవగాహన కలిగివుండాలి

రాజంపేట టౌన్: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఆర్థికరంగంపై అవగాహన కలిగివుండాలని స్థానిక డీసీసీ బ్యాంక్ మేనేజర్ రాజేష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం ఆర్థిక-అక్షరాస్యత అనే అంశంపై మండల స్థాయిలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థికరంగంపై చైతన్యం కల్పించేందుకు క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో మండలంలోని 13 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రథమ బహుమతి రూ.5 వేలను తాళ్ళపాక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వైష్ణవి, హాసిని గెలుపొందగా, ద్వితీయ బహుమతి రూ.4 వేలను రాజంపేట జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన సబిహా, శ్రీహిత కైవసం చేసుకున్నారు. తృతీయ బహుమతి రూ.3 వేలను పోలి ఎంపీపీ స్కూల్‌కు చెందిన హరికీర్తన గెలుపొందింది. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వైష్ణవి, హాసిని ఈనెల 28వ తేదీ రాయచోటిలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వేల్పుల నాగరాజు, ఫీల్డ్ ఆఫీసర్ నరహరి తదితరులు పాల్గొన్నారు.

చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

సిద్దవటం : కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామని, చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. సిద్దవటం మండలం లోని మాధవరం–1 గ్రామ శివారులో ఉన్న శ్రీ కనక దుర్గ కళ్యాణ మండపంలో బుధవారం చేనేత సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి వెల్ఫేర్ అండ్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను తెలుసుకునేందుకు సదస్సు నిర్వహించామని.. ఈ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. గత ప్రభుత్వాలు చేయని విధంగా వైఎస్ జగన్ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. జింకా విజయలక్ష్మి మాట్లాడుతూ కరోనా సమయంలో చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం కింద రూ. 24 వేలు రెండు విడతలు మంజూరు చేశారన్నారు. నేతన్న నేస్తం పథకానికి చేనేత కార్మికులు జీఎస్టీ నమోదు చేయనవసరం లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని, ఛైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో చేనేతజౌళి శాఖ ఏడీ భీమయ్య, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు, జెడ్పీటీసీ లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, చేనేత కార్మికులు, చేనేత సహకార సంఘాల ప్రెసిడెంట్లు, మాస్టర్ వీవర్స్ పాల్గొన్నారు.


చేనేత కార్మికుల సదస్సులో మాట్లాడుతున్న రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

మణిరత్నాలకు మానవతా సత్కారం

చిట్వేలి : పదిలో ప్రతిభ చూపిన మణిరత్నాలకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలిశాఖ సత్కారం చేసింది. బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి అధ్యక్షతన సత్కార సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన సి శ్రావ్య 589, (శ్రీ సాయి వికాస్, చిట్వేలి), ఎన్ మాన్విక 589 (ఎస్‌వీ విద్యానికేతన్, నాగవరం)లకు రూ. 2500లు చొప్పున నగదు ప్రోత్సాహం, ప్రశాంసా పత్రం, మెమెంటో అందజేశారు. అలాగే చిట్వేలి జడ్పీ ఉన్నత పాఠశాల స్థాయిలో ప్రథమస్థానం సాధించిన స్పందన 572కు సంస్థ రూ. 5 వేలు, ఉపాధ్యాయులు తిరుమల విశ్వనాథం రూ. 5 వేలు మొత్తం రూ. 10 వేలు నగదు ప్రోత్సాహం, మెమెంటో, ప్రశంసాపత్రం అందజేశారు. అదే విధంగా మండలంలోని ఉన్నత పాఠశాలల్లో ప్రథమ స్థానం సాధించిన శివచరణ్ 537 (జడ్పీ, వెంకట్రాజుపల్లి), పీవీఎస్ మధురిమ 524 (జడ్పీ, నాగవరం), టి గురువర్మ 522 (జడ్పీ, పోలోపల్లి), బి నందిని 449 (కేజీవీ విద్యాలయం), కె నందినీ 387 (జడ్పీ కె కందులవారిపల్లి)లకు మెమెంటో, ప్రశంసా పత్రం అందజేశారు. జీఎల్ మోహన్ రూ. 5 వేలు, పురుషోత్తం నాయుడు రూ. 5 వేలు, తిరుమల విశ్వనాథం రూ. 5 వేలు చొప్పున ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మానవతా బాధ్యులు సురేంద్రరెడ్డి, మునిరావు, సాయిరాం, రంగారెడ్డి, ఉమా మహేశ్వరరెడ్డి, సభ్యులు మోహన్, సుమన్, మురళీ, చంద్ర, ప్రసాద్, సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.


మణిరత్నాలతో మానవతా బాధ్యులు, సభ్యులు

ఇష్టంతో చదివితే సులువుగా లక్ష్యసాధన

రాజంపేట టౌన్ : విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితే సులువుగా లక్ష్యాన్ని సాధించవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్‌లో 964 మార్కులు సాధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల విభాగంలో అన్నమయ్య జిల్లాటాపర్‌గా నిలిచిన శివసాయికార్తీక్‌కు బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రామిరెడ్డి మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన శివసాయికార్తీక్ జిల్లా టాపర్‌గా నిలవడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ఇంటర్‌లో జిల్లా టాపర్‌గా నిలిస్తే ప్రభుత్వం రూ.50 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తుందన్నారు. ఈనగదు విద్యార్థుల ఉన్నత చదువులకు దోహదపడగలదని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రమోహన్, రవిచంద్రనాయుడు, రామాంజనేయులు, జయరాం, సీ.మనోహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


శివసాయికార్తీక్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామిరెడ్డి, అధ్యాపకులు

25న ఉచిత కంటి వైద్య శిబిరం

పెనగలూరు : ఈనెల 25వ తేదీన పెనగలూరు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మహా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. అరవింద్ హాస్పిటల్, మధురై, అన్నమయ్య జిల్లా సంయుక్తంగా నిర్వహించు కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు పరీక్షలు చేయనున్నారన్నారు. కంటి అద్దాలు అవసరమైన వారికి ఉచితంగా శిబిరం వద్దనే అందిస్తామని తెలిపారు. ఆధార్ కార్డు, మరేదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని కోరారు. ఈ వైద్య శిబిరాన్ని ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా చొప్పాగంగిరెడ్డి జన్మదిన వేడుకలు

రాజంపేట : ఏఐటీఎస్‌లో అధినేత చొప్పా గంగిరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా ఏఐటీఎస్ వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి బర్త్‌డే కేక్‌ను కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సోదరుడు చొప్పా గంగిరెడ్డి గ్రామీణ ప్రాంతానికి సాంకేతిక విద్యను తీసుకురావడం వల్ల రాజంపేటకే ఏఐటీఎస్ తలమానికంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, ఏవో సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఆకడమిక్ డీన్ డా.మల్లికార్జునరావు, డీన్ ఆఫ్ స్టూడెంట్ డా.సుబ్బారావు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


ఏఐటీఎస్‌లో చొప్పా గంగిరెడ్డి జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి

ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలి

పెనగలూరు : మండలంలో రైతుల ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలని మండల వైస్ ప్రెసిడెంటు కొండూరు విజయ్ రెడ్డి అన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆన్‌లైన్ సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని పరిష్కరించాలన్నారు. ఈ–పాస్ పుస్తకాలపై కూడా దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, కె వెంకటేశ్వరరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతి

పెనగలూరు : పదోతరగతిలో ప్రతిభ కనబరిచిన చక్రంపేట హైస్కూల్ విద్యార్థులకు పోలిన మునెమ్మ జ్ఞాపకార్థం తుంగా రామాంజనేయులు రూ. 20 వేలు నగదును బహుమతిగా అందించారు. మొదటి ర్యాంక్ సాధించిన రమ్య, వరకుమార్ అనే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 5200లు చొప్పున, ద్వితీయ స్థానం పొందిన దీపిక చౌదరి, నందకిషోర్‌లకు రూ. 3600 చొప్పున, తృతీయ స్థానం సాధించిన తేజశ్వతీ, విష్ణులకు రూ. 1700 నగదును అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల కృష్ణ, ట్రస్టు మెంబర్, హైస్కూల్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు

లక్కిరెడ్డిపల్లి : ఉత్తమ ఫలితాలు సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నమయ్య జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. 2022–23 విద్యా సంవత్సరానికి 10వ తరగతిలో మండలస్థాయిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేశారు. స్థానిక ఎస్సీ బాలల వసతి గృహంలో చదివిన ఆదిశంకర్ 553 మార్కులు, ఏపీ మోడల్ స్కూల్, ఎస్సీ బాలికల వసతి గృహంలో రెడ్డిచరణ్య 579 , కార్తికేయ 579 మార్కులు సాధించారు. వీరికి జాకీర్ హుస్సేన్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఏడాది మెను చార్జీలు పెంచిందని, విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యుఓ రఘురామయ్య, హెచ్‌డబ్ల్యుఓలు శ్రీనివాసులు, సావిత్రి పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జాకీర్

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

సిద్దవటం : మలేరియా, డయేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు తెలిపారు. సిద్దవటం మండలం భాకరాపేట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో మలేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మికేశమ్మ, పీడీ రామచంద్ర, ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.